జీ.కే విధి సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా వరప్రసాద్

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్త వీధ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా వరప్రసాద్ నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం ఆయన సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో విజయవాడలోని సైబర్ క్రైమ్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా చేస్తూ బదిలీల్లో భాగంగా జీకే విధి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక ఎస్సై అప్పలసూరి సిబ్బంది సాదర స్వాగతం పలికారు. గూడెం కొత్త వీధి మండలంలోని పోలీస్ స్టేషన్‌కు గత నాలుగు నెలలుగా సర్కిల్ ఇన్స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. మండల పోలీస్ స్టేషన్ సిఐగా పోలీస్ శాఖ గతంలో నలుగురిని నియమించినప్పటికీ, సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఎవరు విధుల్లో చేరలేదు. ఎట్టకేలకు సర్కిల్ ఇన్స్పెక్టర్ గా వరప్రసాద్ బాధ్యతలు తీసుకున్నారు.

గిరిజన ప్రజా సంఘాల ర్యాలీతో దద్దరిల్లిన పాడేరు

- -జీవో నెంబర్ 3కి ప్రత్యామ్నాయం చట్టం చూపాలని పాడేరు ఐటిడిఏ ముట్టడి
- భారీగా తరలివచ్చిన గిరిజన నిరుద్యోగులు
- గిరిజన స్పెషల్ డీఎస్సీతో ఏజెన్సీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే, రాష్ట్ర మన్యం బంద్ ప్రకటిస్తాం
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు గిరిజన ప్రజా సంఘాలు హెచ్చరిక

విశాలాంధ్ర-పాడేరు : ఆదివాసీలకు నూరు శాతం రిజర్వేషన్, ఆదివాసి షెడ్యూల్ ఏరియా ఉద్యోగ నియామక చట్టం అసెంబ్లీలో చేయాలని,గిరిజన స్పెషల్ డిఎస్సితో ఉపాధ్యాయ నియామకాలన్నీ గిరిజన నిరుద్యోగులకే నియమించాలని శుక్రవారం చలో ఐటీడీఏ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుండి ఐటీడీఏ వరకు గిరిజన నిరుద్యోగులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణలు మాట్లాడుతూ గిరిజన స్పెషల్ డిఎస్సితో ఏజెన్సీ ప్రాంతాల్లో ఖాళీ టీచర్స్ పోస్టు భర్తీ చేయాలని,ఆదివాసి షెడ్యూల్ ఏరియా ఉద్యోగ నియామక చట్టం చేయకపోతే చలో అసెంబ్లీ పిలుపునిచ్చి ఆదివాసి ప్రాంతా నిరుద్యోగులు అందర్నీ ఐక్యం చేసి అసెంబ్లీని ముట్టడిస్తామని వారన్నారు.మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 16,347 టీచర్ పోస్టులు భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని,షెడ్యూల్డ్ ఏరియాలో నూరు శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ ను 2020లో సుప్రీం కోర్టు రద్దు చేస్తే గత ప్రభుత్వం పునరుద్ధరణ చేయకుండనే జనరల్ డిఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడంతో ఆదివాసులు తీవ్ర ఆందోళనకు గురైయ్యారు.నేడు రాష్ట్ర ప్రభుత్వం మెగ డిఎస్సీ ద్వారా ఏజెన్సీలో గిరిజన సంక్షేమ, ప్రభుత్వ, జిల్లా పరిషత్‌లో పాఠశాలలో టీచర్స్ పోస్టు ఖాళీలు భర్తీకి రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుచేస్తే ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతాయన్నారు. గురుకులం (బ్లైలా) నిబంధనలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం జనరల్ డిఎస్సీలో గురుకులం పోస్టులను కూడ విలీనం చేసిందని,గిరిజన గురుకులానికి ఉన్న స్వయం ప్రతిపత్తిని కూడా లెక్కచేయకుండా ఏకపక్షంగా ప్రభుత్వం పిజిటి 58 పోస్టులు, టిజిటి 446 పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయడం దారుణమన్నారు. గిరిజన గురుకులంలో జోనల్ వ్యవస్థ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తారు. కాని జనరల్ డిఎస్సీ మాత్రం జిల్లా యూనిట్‌గా నోటిఫికేషన్ జారీ చేసియున్నారు. గత 20 సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్నా రెగ్యులర్ చేయకుండా జనరల్ డిఎస్సీ ద్వారా స్కూల్ ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులైన ఆదివాసీలను గెంటి వేయొద్దని కోరుతున్నాను. ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు ఉద్యోగ రిజర్వేషన్‌కు గత రాష్ట్ర ప్రభుత్వం 5వ షెడ్యూల్డ్ క్లాజ్ (2) ప్రకారం చట్టబద్ధత కల్పిస్తామని, ట్రైబల్ అడ్వైజర్ కౌన్సిల్(టిఏసి) చేసిన తీర్మానాని నేటి ప్రభుత్వం అమలుచేయలేదన్నారు. ఇప్పటికే ఆదివాసీ నిరుద్యోగులు తీవ్రమైన అభద్రత భావం, ఆందోళనతో ఉన్నారన్నారు. నేటికీ పునరుద్ధరణకు కనీసం ఎటువంటి చర్యలకు ఉపక్రమించక పోవడంతో ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోంద న్నారు. రాజ్యాంగంలో 5వ షెడ్యూల్ ఏరియాలో ఆదివాసులకు భద్రత, రక్షణ, పరిపాలన బాధ్యత గూర్చి స్పష్టంగా పేర్కొనబడినదని, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే ఏ ఉత్తర్వులైనా 5వ షెడ్యూల్ క్లాజ్ (1)(2) ప్రకారం గవర్నర్, టీ.ఏ.సి అనుమతి తప్పకుండా తీసుకోవలసీ ఉందని, ఆదివాసులకు ప్రత్యేక భాష సంస్కృతి ఉందని, గిరిజన భాష రాని ఉపాధ్యాయులను ఏజెన్సీలో నియమించడంవల్ల ఆర్టికల్ 29,32 ఉల్లంఘించినట్లు అవుతుందన్నారు. కె.జి.బి.వి, ఏకలవ్య మోడల్ స్కూల్ తో పాటు గత ప్రభుత్వ కాలంలో 1998, 2008లో సుమారు 400 నుండి 2000 డీఎస్సీ పోస్టుల ద్వారా 280 ఎస్సీటీ పోస్టులను పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో మినిమం టైమ్స్ స్కేల్ ప్రాతిపదికన స్థానికేతరులతో గత ప్రభుత్వం భర్తీ చేయడం వల్ల ఆదివాసీలు

ఉద్యోగం పొందుతామనే ఆశ, నమ్మకం కోల్పోయి అసాంఘిక కార్యకలాపాలవైపు మొగ్గుచూపుతున్నారు. అధికారంలోకి వచ్చాక ఆదివాసీలకు నూరు శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ కల్పిస్తామని నాడు అరకు ఎన్నికల సభలో నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన విషయం మీకు విధితమే. కావున ప్రభుత్వం వెంటనే మెగా డిఎస్సీ నోటిఫికేషన్ కు బదులుగా ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో టీచర్స్ పోస్టు భర్తీకి పునర్ పరిశీలించి ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ నిరుద్యోగులకు భద్రతా, భరోసా కల్పించే చర్యలు తీసుకొవాలని, నవంబర్ 11న ప్రభుత్వం నిర్వహించే అసెంబ్లీ సమావేశంలో ఏజెన్సీ ప్రాంతాలో స్థానిక ఆదివాసులకు నూరు శాతం రిజర్వేషన్ చట్టబద్దత కోసం షెడ్యూల్డ్ ఏరియా ఉద్యోగ,ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలని కోరుతున్నామని,అన్ని ప్రజాసంఘాలతో చర్చిస్తున్నాం ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే చలో అసెంబ్లీ బంద్ కూడా చేయడానికి వెనకాడబోమని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ ధర్మనా పడాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు, పాంగి జీవన్ కృష్ణ, కార్తీక్ శ్రీను, ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష ,కార్యదర్శులు రాజశేఖర్, కృష్ణ, ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ వంతాల నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ నాయకులు లక్ష్మణ్ రావు ,చంటి, ఆదివాసి మహిళా సంఘం నాయకురాలు హైమావతి, గిరిజన మహిళా సంఘం లత, ఏఐటీయూసీ నాయకులు అమర్, రాజబాబు, గిరిజన సంఘం జిల్లా నాయకులు కృష్ణారావు, లక్కు, ఆదివాసి సేన నాయకులు రాజబాబు, జన విజ్ఞాన వేదిక నాయకులు జంపరంగి ఆనంద్, మాతృభాష విద్యావాలంటర్ల అధ్యక్ష కార్యదర్శులు కోర్ర శ్రీను, మర్రి చిట్టిబాబు, నిరుద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెంపుడువలస గ్రామంలో విద్యుత్ స్తంభాలు మరమ్మతులు చేయాలి

టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య డిమాండ్

విశాలాంధ్ర-అనంతగిరి : శుక్రవారం గ్రామస్తులతో కలిసి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను పరిశీలించారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పెంపుడువలస గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు మరమ్మతులు చేయాలని ఎలక్ట్రికల్ ఏఈ ని ఎనిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్కూల్ అనుకుని ఉన్న స్తంభాం పిల్లల పై పడ్డె ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు స్కూల్ మాస్టర్ సర్పంచ్‌గా నేను లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని ఫోన్ ద్వారా అనేక సార్లు ఫిర్యాదు చేసినా కనీస పట్టించుకోవడం లేదని విమర్శించారు అనంతగిరి ఎలక్ట్రాల్ ఏఈ ఆపిషుకే రాకుండా ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని అన్నారు సమదిత డీఈ. ఈఈ. స్పందించి వెంటనే పూర్తిగా తుప్పు పట్టి ఉన్న 3 విద్యుత్ స్తంభాలు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సమర్ది లక్ష్మణరావు పాంగి మద్దు సమర్ది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల బియ్యం 1750 కిలోలు స్వాధీనం

విశాలాంధ్ర-కొమరాడ : పార్వతీపురం ఐటిడిఏ పరిధిలో గల ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఉండాల్సిన ప్రభుత్వం రేషన్ బియ్యం విక్రాంపురంలో శుక్రవారం దర్శనమిచ్చాయి. ఈ సందర్భంగా సివిల్ సప్లై అధికారులు అక్రమంగా నిల్వ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. సివిల్ సప్లై ఉప తహసీల్దార్ రాజేంద్ర కు కేసు నమోదు చేశారు విక్రంపురం గ్రామంలో చెందిన మేరంగి గంగయ్య ఇంట్లో బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం వచ్చిందన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఒక ఇంట్లో నిల్వ ఉన్న బియ్యాన్ని గుర్తించినట్లు ఆయన తెలిపారు. 35 కేజీల 50 బియ్యం బస్తాలను గతంలో ఉలిపిరి ఆశ్రమం పాఠశాలలో పనిచేసిన మాజీ వార్డెన్ ఇంట్లో నిలువ ఉన్నట్లు తెలిపారు. నిల్వ ఉన్న బియ్యాన్ని స్థానిక డీలర్ గ్రామ రెవెన్యూ అధికారి మహిళా పోలీస్ సహాయంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని 6%ఖు% కేసు నమోదు చేసి జెసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. అక్రమంగా నిల్వ ఉన్న బియ్యాన్ని స్థానిక రేషన్ డీలర్ కు అందజేసినట్లు తెలిపారు. ఏది ఏమైనా పిల్లలకు పెట్టాల్సిన రేషన్ బియ్యం ఎలా అక్రమంగా దారి మళ్లించడం పై పలువురు మండిపడుతున్నారు. మండలంలో ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వ రేషన్ పక్కదారి పట్టకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసి అక్రమ బియ్యం రావాలను అడ్డుకట్ట వేయాలని ప్రజలు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎంపీడీవోకు వివోలు వినతి

విశాలాంధ్ర-దుంబ్రిగుడ:మూడేళ్ల కాల పరిమితిని విరమించుకోవాలని స్థానిక మండల కేంద్రంలో ఐకెపిలో పని చేస్తున్న వీఏవోలు చేపట్టిన రిలే దీక్షలు మూడో రోజు శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివో ఆర్ పి ఆర్ డి విజయ్ కు వినతిపత్రం అందజేశారు. వీరి ఆందోళనకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ర్యాలీలో పాల్గొని సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భాస్కరరావు, కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు వి జమున, కాంగ్రెస్ పార్టీ పిసిసి ప్రతినిధి పి చిన్నస్వామి, ఆ పార్టీ నాయకులు, మండలంలోని వివోలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్పందనలో ధారకొండ సమస్యలపై వినతులు

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్త వీధి మండలంలో అమ్మవారిధారకొండ, గ్రామ పంచాయితీ అభివృద్ధిలో వెనుకబడి ఉందని శుక్రవారం స్పందన కార్యక్రమంలో గ్రామస్తులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు కోసం, చెక్ డ్యామ్, రోడు బ్రిడ్జిలు, ఈ సమస్యలపై దరఖాస్తు స్పందనలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారికి అందజేయడం జరిగింది. 25 మంది గ్రామస్తులం స్పందనకు వెళ్లి తమ బాదలను, సమస్యలను అధికారులకు తెలియజేయడం జరిగిందినీ అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. ఈకార్యక్రమంలో గాలికొండ, ఎంపీటీసీ వంపురంగి, బుజ్జిబాబు, పంచాయతీ సర్పంచ్ రామరావు, చంటిబాబు, ఆనందరావు, మలేశ్వరావు, బాలు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయండి

ఇస్లామిక్ కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన జమాతే ఇస్లాం రాష్ట్ర అధ్యక్షుడు రఫీక్

విశాలాంధ్ర-చింతపల్లి :ముస్లిం మహిళలు ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించుకునేందుకు చింతపల్లిలో ఇస్లామిక్ కేంద్రం కోసం ప్రత్యేక భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జమాఅతె ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షులు ముహమ్మద్ రఫీక్ విచ్చేసి స్థానిక ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ మీరా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం పిల్లలు ఖురాన్ శిక్షణ, నమాజ్ ఆచరణ, మహిళలు నమాజులు ఆచరించేందుకు ఈ భవన నిర్మాణం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అదే క్రమంలో ముస్లింలు శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇస్లామిక్ కేంద్ర భవనం ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మజీద్ ఇమామ్, ముస్లిం కమిటీ సభ్యులు, జమాతే ఇస్లాం కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పార్వతీపురం మన్యం

రంగంపేటలో పంటకోత ప్రయోగాలను సబ్ కలెక్టర్ పర్యవేక్షణ

విశాలాంధ్ర -సీతానగరం:మండలంలోని రంగంపేట గ్రామంలో మరడ సింహాచలం రైతుపొలంలో 5లి5 విస్తీర్ణంగల వరిపంటకోత ప్రయోగం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ ప్రయోగం ద్వారా 14.480 కేజీల దిగుబడి వచ్చిందని అధికారులు తెలిపారు.సీతానగరం మండలంలో 128 పంట కోత ప్రయోగాలు, జిల్లా వ్యాప్తంగా 1768 వరి పంట కోత ప్రయోగాలు నిర్వహించడం జరుగుతుందని తెలియచేశారు. ప్రతి 100 హెక్టార్ల వరి పంట విస్తీర్ణాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని 4పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తారని తెలిపారు. ఒక యూనిట్ లో వచ్చిన దిగుబడి ఆధారంగా పంటల ఇన్సూరెన్స్ మరియు ధాన్యం కొనుగోలు నిర్ణయించడం జరుగు తుందన్నారు. ఈ పంటకోత ప్రయోగాలద్వారా వచ్చే దిగుబడి ఆధారంగా వ్యవసాయ రంగంలో రాష్ట్రం స్థూలరాష్ట్రఉత్పత్తి తెలియజేయడం జరుగుతుంద న్నారు. ఈకార్యక్రమంలో డివిజనల్ ఉప గణాంక అధికారి కోట జయప్రకాష్, తహసిల్దార్ అల్లువాడ ఉమమహేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి ఎస్ అవినాష్ మండల గణాంక అధికారి సతీష్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎమ్.వాసు, గ్రామ రెవెన్యూ అధికారి, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎఐటియూసీ నాయకురాలు ముందస్తు అరెస్ట్

విశాలాంధ్ర-సాలూరు : రాష్ట్రవ్యాప్తంగా వాలంటీర్లను విధులలోకి తీసుకోవాలని ఏఐటీయూసి ఆధ్వర్యంలో విజయవాడలో నేడు జరగనున్న సదస్సుకు పయనమవు తున్న మన్యం జిల్లా ఎఐటియుసి ఉపాధ్యక్షురాలు బలగరాధను సాలూరు పట్టణ పోలీసులు శుక్రవారం ఉదయం హౌస్ అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వాలంటీర్లను విధులలోకి తీసుకోవడంతో పాటు రూ10 వేల రూపాయలు జీతం చెల్లించాలని ఏఐటీయూసి న్యాయబద్ధంగా పోరాటం చేస్తుందన్నారు. ఈమేరకు విజయవాడలో వాలంటీర్లతో సమావేశం ఏర్పాటుచేసి రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి ఎఐటియుసి సిద్ధపడిందన్నారు. వాలంటీర్లకు న్యాయం జరిగే వరకు ఎఐటియుసి అలుపెరుగని పోరాటం చేస్తుందని తెలిపారు. వాలంటీర్లు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీని మాత్రమే న్యాయబద్ధంగా అడుగుతున్నారన్నారు. న్యాయ పరమైన కోర్కెలను తీర్చకుండా గత ప్రభుత్వం వలె భయపెట్టాలని చూడటం సరికాదన్నారు. అక్రమ అరెస్ట్‌లకు భయపడేది లేదని అరచేతితో సూర్యోదయాన్ని ఆపలేరన్నారు.వాలంటీర్లకు న్యాయం జరిగే వరకు ఏఐటియుసి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయ పాత్రలో డిఐపిఆర్ఓ

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్ ఉపాధ్యాయ పాత్రలో విద్యార్థులకు విద్యా బోధన చేశారు.మండలంలోని రావికోన ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో పల్లె నిద్ర చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు ఆశ్రమ ఉన్నత పాఠశాలకు హాజరయ్యారు. వసతి గృహాన్ని నిశితంగా పరిశీలించిన ఆయన అక్కడ అందుతున్న విద్యా ప్రమాణాలు, నాణ్యమైన పోషకాహారం, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, కిచెన్ గార్డెన్, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.కాసేపు ఉపాధ్యాయునిగా మారి పదవ తరగతి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల చదువు సమయంలో విద్యా ప్రమాణాలను పరిశీలించి, మరింత మెరుగైన విద్యా బోధన ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

ఐటిడిఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-సీతంపేట : ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాత్రి బస కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి సీతంపేట బాలుర ఆశ్రమ పాఠశాలలో బసచేసిన పివో శుక్రవారం ఉదయం సీతంపేట పంచాయతీలోని వాబ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని అన్ని వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కాలువలు, తాగునీటి సమస్య పరిష్కరించాలని పివోను కోరగా స్పందించిన పీవో కాలువలు శుభ్రం చేయుటకు, త్రాగునీరు సమస్య పరిష్కరించుటకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అదే విధంగా గృహ నిర్మాణ బిల్లులు కూడా మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలోని వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అనంతరం సీతంపేటలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. దీని అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గీతాంజలి, పశు సంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు, సిడిపివో రంగలక్ష్మి, ఈవోఆర్డీ సత్యం ఇతర మండల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పుస్తకాలు కొనుగోలు చేయండి

విశాలాంధ్ర-పాలకొండ: విశాలాంధ్ర పుస్తకాలు కొనుగోలు చేసి చదవండి చదివించండి విజ్ఞానాన్ని పెంపొందించుకోండి అని కౌన్సిలర్స్ గంటా సంతోష్‌కుమార్ కడగల వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం పాలకొండ పట్టణంలో విశాలాంధ్ర సంచార పుస్తకాలయ వాహనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. విశాలాంధ్రకు తెలుగు రాష్ట్రాల్లో సుదీర్ఘమైన చరిత్ర ఉందని ప్రజలకు అవసరమైనటువంటి పుస్తకాలు ఈ విశాలాంధ్ర విజ్ఞానసమితి ద్వారా ప్రచురణలు జరుగుతున్నాయని వీటిని విద్యార్థిని విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలు కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈసంచార వాహనం 3రోజులపాటు పట్టణంలో ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని కోరారు. వీరితోపాటు విశాలాంధ్ర నియోజకవర్గ బాధ్యులు బిహెచ్ కాంతారావు జి.రామారావు, ఎస్ గణపతి రావు, పుస్తకాల నిర్వాహకులు నజీర్ సిబ్బంది ఉన్నారు.

నీలకంఠాపురం పోలీసుస్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-కురుపాం : మండలంలోని నీలకంఠాపురం పోలీస్ స్టేషన్‌ని జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి శుక్రవారం అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్లో గల సవరణలను, రికార్డ్స్, కేస్ ఫైల్స్ ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం మహిళా పోలీసులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మహిళా పోలీసులు విధులు, గ్రామాల్లో శాంతి భద్రతల గూర్చి అడిగి తెలుసుకుని వారి విధులు బాధ్యతలు కార్యక్రమాలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి రాంబాబు,ఎల్విన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.హరి, ఎస్సైలు నీలకంఠ రావు, నారాయణరావు పాల్గొన్నారు.

ప్రభుత్వం ధాన్యం కొనకుంటే ధర్నాలు చేయండి

రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి పిలుపు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్/బెలగాం : రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల చాలా కర్కశంగా వ్యవహరిస్తుందని, రైతుల గోడు ప్రభుత్వం పెడచెవిన పెట్టడం అన్యాయమని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం కృష్ణమూర్తి అన్నారు. ధాన్యం రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసుతో కలిసి శుక్రవారం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ రైతుల నుంచి కొనుగోలు చేసే దాన్యంలో ప్రభుత్వం చాలా కుట్రలు పన్నుతున్నాయని, క్వింటాకు 17 రూపాయల నుండి 18 రూపాయల వరకు కొంటున్నారని, కొన్న దరకు పదింతల రెట్టింపుల్లో ధాన్యం అమ్మకాలు చేపడుతున్నారాని ఇది చాలా అన్యాయమని మండిపడ్డారు. దీనివలన రైతుకి ఒక ఎకరానికి 1200 రూపాయల నుండి 1400 రూపాయల వరకు నష్టం కలుగుతుందని తెలిపారు.ధాన్యం సీజనల్ ప్రారంభమైనప్పటికీ రైతులు ధాన్యం ఎక్కడ కొనాలో ఎప్పుడు కొనాలో ఎవరికి అమ్మాలో ఈరోజుకి ఎటువంటి ప్రణాళిక ప్రభుత్వం దగ్గర లేకపోవడం దురదృష్టమన్నారు. పెత్తందారులతో, దళారులతో ప్రభుత్వం కుమ్మక్కైందుకు చర్చలు కుదించుకునే పనిలో ఉందని రైతు సంఘం భావిస్తుందన్నారు. రైతుల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడం వల్ల 1.66 ఎకరాలకు గాను మొత్తం 2.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ధర నష్టం వాటిల్లుతుందని దీనికి ప్రభుత్వమే పూర్తిబాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. కావున ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో ధాన్యం ప్రభుత్వమే నేరుగా కనీసం మద్దతు ధర 23 రూపాయలకు కొనాలని డిమాండ్ చేశారు. అంతకంటే తక్కువ ధరకు రైతులు ఎవరూ కూడా అమ్మొద్దని, ఒకవేళ కొనుగోలు చేయకపోతే గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం మూటలతో ముట్టడించి హెచ్చరించాలని రైతులకు పిలుపునిచ్చారు.

టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు

విశాలాంధ్ర-సీతంపేట: మండలం పులిపుట్టిలో గల ముక్కిడి పోలమ్మ దేవాలయం వద్ద ఉన్న కన్నెదార కొండ వద్ద పర్యాటకాన్ని అభివృద్ధి చేయుటకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదేశాలతో కన్నెదార కొండపై పర్యాటకాన్ని అభివృద్ధి చేయుటకు అడుగులు పడుతున్నాయి. ఆ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయమని గ్రామస్తులు ఐటిడిఏ పీవోకు వినతి పత్రం సమర్పించగా ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఐటీడీఏ అధికారుల బృందం పులిపుట్టి, పి.పి ఈతమానుగూడ పంచాయతీల గ్రామస్తులతో సమావేశమై దీనిపై చర్చించడం జరిగినది. దీనిలో భాగంగా అక్కడ పర్యాటకం అభివృద్ధి చేయుటకు గల అవకాశాలపై గ్రామస్తులతో చర్చించడం జరిగినది. దీనిలో భాగంగా కన్నెదార కొండపై భూములు కలిగి ఉన్న వ్యక్తులు, సంబంధిత గ్రామస్తులు గ్రామసభ తీర్మానం చేసి ఇవ్వాలని అధికార వర్గాలు తెలిపాయి. మరలా ఈనెల 12, 13 తేదీల్లో పర్యాటకశాఖ అధికారులు మరియు ఐటీడీఏ అధికారుల బృందం కన్నెదార కొండను సర్వే చేసి, అక్కడ పర్యాటకం అభివృద్ధి గల అవకాశాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కన్నెదార కొండపై వ్యూ పాయింట్, రోడ్లు, ట్రెక్కింగ్ రూట్, రోప్ వే వంటివి ఏర్పాటు చేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఐటీడీఏ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు సవర తోట మొఖలింగం, ఐటిడిఏ డీపీవో సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి గుంతలు పూడ్చివేత

విశాలాంధ్ర-కురుపాం : కురుపాంలో దీర్ఘకాలిక సమస్యగా ఉన్న ప్రధాన రహదారి లో గుంతలను ఎస్ ఐ పి నారాయణ రావు ఆధ్వర్యంలో పూడ్చి వేసే కార్యక్రమం చేపట్టారు. తోటపల్లి-గుణుపూరు ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయమై వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు గురౌతున్నా విషయం గుర్తించిన ఎస్సై నారాయణరావు శుక్రవారం ఉదయం గుంతలను కప్పించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టి ప్రయాణికులకు సులభతరమైన ప్రయాణాన్ని అందించే ప్రయత్నం చేశారు.ఈ సందర్భంగా ప్రయాణికులు మాట్లాడుతూ ఎంతో మంది ప్రజాప్రతినిధులు,అధికారులు ఈ రహదారి వెంట వెళ్తూ చూస్తున్నప్పటికీ కనీసం తాత్కాలిక మరమ్మత్తులు కూడా చేపట్టలేదని పోలీసులు మనస్సు చెలించి ప్రయాణికుల కష్టాలు తాత్కాలికంగా తీర్చినందుకు పోలీస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు ఎంపికైన తోణాం విద్యార్థులు

విశాలాంధ్ర-సాలూరు : రాష్ట్ర స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు తోణాం, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు సాయి వినోద్, వెంకటరావులు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.సింహాచలం తెలిపారు.విజయనగరం లో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ఎంపిక అయిన వారిరువురూ శనివారం భోగాపురం లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు.క్రీడలలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎటిడబ్ల్యూఓ శ్రీనివాసరావు,వార్డెన్ ముప్పల లచ్చయ్య,వ్యాయమ ఉపాధ్యాయులు ఈశ్వరరావుతో పాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

కన్నంపేటలో తాటాకు ఇల్లు దగ్ధం

లక్ష రూపాయలు నష్టం

విశాలాంధ్ర-కొయ్యూరు : మండలంలో ఆడాకుల పంచాయతీ కన్నంపేట గ్రామంలో ఆకస్మికంగా వ్యాపించిన మంటలకు పూరిగుడిసె దగ్ధమవడంతో ఇరటాసోములమ్మ పూర్తిగా నిరాశరులైంది. ఇల్లు దగ్ధం కావడంతో ఇంట్లో వస్తువులతో పాటు తిండి గింజలు సర్వసం కాలి బూడిదవడంతో బాధితురాలు సోములమ్మ కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది. ఈ పూరి గుడిసె దగ్ధం అయిన సంఘటనలో సుమారు లక్ష రూపాయల వరకు నష్టం వాటిలిందని బాధితురాలు తెలిపారు ఈ విషయం తెలుసుకున్న ఆడాకుల ఎంపీటీసీ అప్పన వెంకటరమణ ఇల్లు కాలిపోయిన బాధితులాలకు ప్రభుత్వం నుండి రావలసిన రాయితీలను త్వరితగతిన వచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. అదేవిధంగా బాధితురాలు కు తమ వంతుగా ఆర్థిక సాయం అందించేందుకు కూడా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

కురుపాంలో తెలుగుదేశం సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-కురుపాం : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కురుపాంలో లక్ష్యానికి మించి పూర్తి చేయాలని మండల కన్వీనర్ కె.వి.కొండయ్య అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదును చేపట్టారు.ఈ సందర్భంగా ఆయను మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సభ్యత్వ నమోదును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి కార్యకర్తకు సభ్యత్వం చేయించాలని నిర్దేశించిన బాధ్యతని తూచ తప్పకుండా పాటించాలని కోరారు..ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమణమూర్తి, యువ నాయకులు చందక రామకృష్ణ ,టిడిపి నాయకులు సుకేష్ చంద్ర పండ, కరి శ్రీను, సురేష్, ఎస్ .రమణ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయలకు ధూప దీప నైవేద్యాలు పంపిణీ

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : దాన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ ధ్వారా రాజవొమ్మంగి మండలంలో 40 దేవాలయాలకు ధూప,దీప ,నైవేద్యాలు అందిస్తున్నట్లు ఆ ట్రస్ట్ సభ్యుడు తాము సూరిబాబు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా ఈ పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. హిందు బంధువులందరు ఇటువంటి కార్యక్రమలలో పాల్గొని తమ సంస్కృతిని సాంప్రదాయాలను కాపాడుకోవాలని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 104 సిబ్బంది తహసీల్దార్, మండల పరిషత్తు కార్యాలయ వివో పి ఆర్ డి విజయ్ కుమార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆ సంఘం నాయకులు జగదీష్, రాకేష్ మాట్లాడారు. 104లో విధులు నిర్వహిస్తూ గిరిజన ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం అరబిందో యాజమన్యంకు అప్పగించడంతో ఇబ్బందులు పడ్డామన్నారు. ఇప్పటికి మూడు నెలలుగా వేతనాలు లేక కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 104 సర్వీసులను ప్రభుత్వం ఆధీనంలో తీసుకుని పీహెచ్సీల ద్వారా నిర్వహించాలన్నారు. అరబిందో యాజమన్యం చెల్లించాల్సిన మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఉల్లాస్‌పై వాలంటరీ టీచర్లకు శిక్షణ

ఎంపీడీవో ఎస్ కే వి ప్రసాద్

విశాలాంధ్ర-కొయ్యూరు : మండలంలో ప్రజానీకానికి 100శాతం అక్షరాస్యత కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమం పై వాలంటీర్ టీచర్స్ కు శిక్షణ ఇవ్వడం జరిగిందని మండల అభివృద్ధి అధికారి ఎస్ కె వి ప్రసాద్ తెలిపారు శుక్రవారం మండల అభివృద్ధి కార్యాల సమావేశ మందిరంలో వాలంటీర్ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజానీకానికి అందరికీ సతశాతం అక్షరాస్యత కల్పించాలని ప్రభుత్వ ధ్యేయమని ఆయన అన్నారు దీనిలో భాగంగానే ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించమని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ బడుగు రమేష్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి విజయ కుమారి. మండల విద్యాశాఖ అధికారి రాంబాబు వెలుగు ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచే ఆలోచనను విరమించుకోవాలి

కాంగ్రెస్ పార్టీ డిమాండ్

విశాలాంధ్ర - బెలగాం : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలలకే ప్రజలపై విద్యుత్ భారాన్ని వేయడానికి పూనుకున్నదని విద్యుత్ చార్జీలు పెంచే ఆలోచనను వెనక్కి తీసుకోవాలని పార్వతీపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ బత్తిన మోహన్ రావు డిమాండ్ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం జిల్లాలో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్లు, ముఖ్య కార్యకర్తలు పార్వతీపురం ఎలక్ట్రికల్ ఎడిఈకి వినతిపత్రాన్ని అందిస్తూ విద్యుత్ చార్జీల పెంపు విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు, సాలూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు గేదెల రామకృష్ణ, సిగడాపు బంగారయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తీళ్ళ గౌరీ శంకర్, రేసు రాము, బోను శంకర్రావు, అల్లు రామ నాయుడు, గుత్తావల్లి దిలీప్, లక్ష్మయ్య, ఊయక కుమార్ తదితరులు పాల్గొని వినతిపత్రాన్ని అందించారు.

10

వెలుగు వివోఏలు మండల కేంద్రంలో భిక్షాటన

వెలుగు యూనియన్ అధ్యక్షులు కాళ్ల మహేష్

విశాలాంధ్ర-కొయ్యూరు : వెలుగు వివోఏలుగా విధులు నిర్వహిస్తున్న వారి సమస్యలు పరిష్క రించాలంటూ గత మూడు రోజులుగా చేపడుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన రాజేంద్రపాలెంలో వివోఏలు భిక్షాటన చేపట్టారు ఈ సందర్భంగా వెలుగు యూనియన్ మండల అధ్యక్షులు కాళ్ళ మహేష్ మాట్లాడుతూ వివో ఏ లకు గత ఎనిమిది నెలల నుండి జీతాలు లేకపోవడంతో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు కూటమి ప్రభుత్వము వివో ఏల సాధారణ సమస్యలపై దృష్టి సాధించి పరిష్కార మార్గం చూపెట్టాలని లేకుంటే భారీ ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ధర్నాకు సిద్ధం అవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు దీనిలో భాగంగానే మండల కేంద్రంలో వివో ఎల ఆధ్వర్యంలో భిక్షాటన నిర్వహించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి సూర్య శాంతకుమారి చంటిబాబు పుష్ప రవణ బాబు భవాని తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం మండల కార్యదర్శిగాఎస్.బి.పోతురాజు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : సిపిఎం మండల ప్రధాన కార్యదర్శిగా ఎస్.బి.పోతురాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల కేంద్రంలో జరిగిన 8వ మహాసభలో ఆ పార్టీ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు కే.సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పలనరసయ్య జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. అందులో మండల ప్రధాన కార్యదర్శిగా ఎస్ బి పోతురాజును రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా టి సూర్యనారాయణ, పి సురేష్ కుమార్, పి సత్యనారాయణ, పి మత్తు, వి.సింహాచలం, జి మహేశ్వరావు, ఏం రామచందర్, కే రామకృష్ణ, ఎస్ గురుమిసింగ్, బి కోటి బాబు, పి అచ్చమ్మను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మండలంలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

అలంకారప్రాయంగా దర్శనమిస్తున్న బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్

కొమ్మంగి ప్రాంత బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు అందని సేవలు

అత్యవసర సమయాలలో సంకేతాలు లేక ఇబ్బంది పడుతున్నామని ఆరోపిస్తున్న వినియోగదారులు

విశాలాంధ్ర-చింతపల్లి : కొమ్మంగి పంచాయతీ కేంద్రంలో అలంకారప్రాయంగా దర్శనమిస్తున్న బి ఎస్ ఎన్ ఎల్ టవర్ సేవలు నిలిచిపోయి సుమారు రెండేళ్లు పూర్తి కావస్తున్నా నేటి వరకు బిఎస్ఎన్ఎల్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రారంభంలో అంతంత మాత్రంగా సేవలు అందించిన ఆటవర్ నేడు ఆ సేవలు కూడా అందించకుండా అలంకార ప్రాయంగా దర్శనమిస్తుందని ఈ ప్రాంతంలోని బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బిఎస్ఎన్ఎల్ సేవలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేయాలని వినియోగదారులు కోరారు. అత్యవసర సమయాల్లో ఎవరికి ఫోన్ చేయడానికైనా సెల్ సంకేతాలు లేకపోవడంతో ఈ ప్రాంత బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి ఇబ్బందులను గ్రహించి బిఎస్ఎన్ఎల్ అధికారులు త్వరితగతిన సమస్య పరిష్కార దిశగా ఆలోచన చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

సమిష్టిగా కృషిచేసి సత్ఫలితాలు సాధిద్దాం

ఎస్సై వెంకటేశ్వరరావు, ఎంఈఓ ప్రసాద్, ఆసుపత్రి సూపరిండెంట్ ప్రభావతి

విశాలాంధ్ర-చింతపల్లి : బాల్యవివాహాలను అరికట్టేందుకు సమిష్టిగా కృషిచేసి సత్ఫలితాలు సాధిద్దామని చింతపల్లి సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, మండల విద్యా శాఖ అధికారి పనసల ప్రసాద్, ప్రాంతీయ ఆసుపత్రి సూపరిండెంట్ ప్రభావతి అన్నారు. ఐసిడిఎస్ సిడిపిఓ జి వి రమణి ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అంగన్వాడీలు, మహిళా సంరక్షణ అధికారులు (మహిళా పోలీసులు), వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో శుక్రవారం నిర్వహించిన బాల్య వివాహాల నిరోధం, కౌమార దశలో కిషోర్ బాలికల రక్షణ తదితర వాటిపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చర్చించారు. మన్య ప్రాంతంలోని బాలికలు అవగాహన లేమి కారణంగా యుక్త వయసులో గర్భం దాల్చడం వలన కలిగే అనర్థాలపై గ్రామ గ్రామాన, పాఠశాలలు, ఆశ్రమాలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తద్వారా బాల్యవివాహాలను, చిన్నవయసులో గర్భం దాల్చకుండా ఉండేందుకు చర్యలు చేపట్టవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఏసిడిపిఓ రామలక్ష్మి, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, అధిక సంఖ్యలో ఎంఎస్‌కెలు పాల్గొన్నారు.

వేటులో ప్రచురితమైన తప్పుడు కథనంతో తమకేమీ ప్రమేయం లేదు

తెదేపా నాయకులు లోకేష్, మధు

విశాలాంధ్ర-చింతపల్లి : వేటులో ప్రచురితమైన వార్తలో చౌడుపల్లి సర్పంచ్ లోకేష్, ఎంపిటిసి మధు అని ప్రచురించడంలో తమ ప్రమేయం ఏమీ లేదని ఆ పంచాయతీకి చెందిన లోకేష్, మధు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మండలంలోని చౌడుపల్లి పంచాయతీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన జల ఉత్సవం ప్రారంభం కార్యక్రమానికి సంబంధించి 'వేటు'లో సర్పంచ్ లోకేష్ అని ఎంపీటీసీ మధు అని ప్రచురించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమ ప్రమేయం లేకుండా వేటులో పొద్దు నీలాంబర్ అనే పేరుతో కథనం ప్రచురితమవడం అందులో చౌడుపల్లి సర్పంచ్ లోకేష్ అని, ఎంపీటీసీ మధు అని ప్రచురితం కావడం తమను ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. కథనాన్ని ప్రచురించే వే టు న్యూస్ వారు కనీసం పంచాయితీ సర్పంచ్ ఎవరో, ఎంపీటీసీ ఎవరో తెలుసుకోకుండా ఇష్టారీతిన పేర్లు ప్రచురించడంతో ప్రజాప్రతినిధులు (సర్పంచ్, ఎంపీటీసీ) తమను తప్పుగా అర్థం చేసుకుంటున్నారని, వేటులో కథనాన్ని ప్రచురించిన వ్యక్తి ఎవరో కూడా తమకు తెలియదన్నారు. ప్రజా ప్రతినిధుల పేర్లు తెలుసుకోకుండా కథనాన్ని ప్రచురించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదీ శిక్ష

కొయ్యూరు సీఐ పి.వెంకటరమణ

విశాలాంధ్ర-కొయ్యూరు : అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం మంప పోలీస్ స్టేషన్ పరిధిలో బూదరాళ్ల పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో 2010లో జరిగిన హత్య కేసులో విశాఖపట్నం పి డి జె న్యాయస్థానం ముగ్గురు ముద్దాయిలకు జీవిత ఖైదీ జైలు శిక్షతో పాటు 40 వేల రూపాయలు జరీనామ విధించిందని కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ పి వెంకటరమణ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2010 కొత్తపల్లి గ్రామంలో కొర్ర బొజ్జయ్య అనే వ్యక్తిని కొత్తపల్లి గ్రామానికి చెందిన గెమ్మెలి రాంబాబు గెమ్మెలి శ్రీను పాంగి బుజ్జిబాబులు భూ వివాదం కారణంగా హత్య చేయడంతో అప్పట్లో కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు .దీనిపై న్యాయస్థానం శుక్రవారం ముగ్గురు ముద్దాయిలకు జీవిత ఖైదీతో పాటు జరీనామా కూడా వీధించడం సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరమణ జరిగిందని తెలిపారు.

ప్రతీ శుక్రవారం గ్రామదర్శిని

విశాలాంధ్ర:సాలూరు/పాచిపెంట: గ్రామాల్లోని సమస్యలు పరిష్కారానికి ప్రతీ శుక్రవారం గ్రామ దర్శిని కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి వి.కొనవలస గిరిజన సంక్షేమ బాలుర గురుకుల వసతి గృహంలో పల్లె నిద్ర చేసిన కలెక్టర్ శు క్రవారం ఉదయం సాలూరు మండలంలోని కురుకుట్టి గ్రామంలో గ్రామ దర్శిని కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలతో మమేకమై ఏమైనా సమస్యలను ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనుల నిర్వహణ పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రం తనిఖీ చేసారు. జీడిపిక్కల ప్రోసేసింగ్ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దర్శిని కార్యక్రమం క్రింద ప్రత్యేక అధికారులు గ్రామాల్లో సందర్శించి ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతంలో రక్త హీనత కేసులు ఎక్కువగా వెలుగులోకి వస్తున్నందున ప్రత్యేక శ్రద్ధ తో పౌష్టికాహారం అందివ్వడం, నెల నెలా రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన ఆరోగ్య తనిఖీలు, గ్రామాలలో పరిశుభ్రత, పారిశు ద్ధ్య పనులు పక్కగా జరిగే విధంగా పర్యవేక్షణ ఉంటుందన్నారు. పాఠశాల, అంగన్వాడి కేంద్రాల్లో బడి తోట నిర్వహణకు ప్రోత్సాహం, గ్రామ పంచాయితీల నిధులతో బాల విహార్ క్రింద పిల్లల ఆట విడుపుకోసం మైదానం ఏర్పాటు చేయనున్నామని అన్నారు. సురక్షితమైన తాగునీరు అందేలా, వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించేలా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులుతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పి మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా తోడ్పాటును అందించాలని తెలిపారు. సికిల్ సెల్ ఎనిమియా విద్యార్థినికి మెరుగైన వైద్యం... ఇంటర్మీడియట్ చదువుతున్న హేమలత సికిల్ సెల్ ఎనిమియాతో బాధపడుతున్నందున కలెక్టర్ దగ్గరుండి రక్త పరీక్షలు నిర్వహించాలని ఏ ఎన్ ఎం లకు ఆదేశించారు. బాలికకు రక్త హీనత ఉన్నట్లు తేలడంతో జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందాలని అవసరమైతే రక్త మార్పిడి చేయాలని వైద్యులు అజయ్ కు సూచించారు. రక్త హీనత కేసులు ఎక్కువగా ఉంటున్నందున రక్త నిల్వలు పెంచేందుకు రక్త దాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హై రిస్క్ గర్భిణీ స్త్రీలకు ముందస్తుగా ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ చేయాలని ఆశావర్కర్లు ను సూచించారు. ఏ ఒక్క గర్భిణీ విషయంలో నిర్లక్ష్యం వహించినట్లు తన దృష్టికి వచ్చిన కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రోగులకు టీబీనీ క్షయ మిత్ర ద్వారా మందులు పంపిణీ చేసి సక్రమంగా మందులు వాడుతున్నది లేనిది ఏ ఎన్ ఎమ్ లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రాథమిక దశలోనే చికిత్స అందించాలని, లేని పక్షంలో ఎక్కువ మందులు వాడాల్సి వచ్చి తీవ్ర అనారోగ్యానికి గురౌతారని అన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. గ్రామంలో ఇంటర్నెట్ సౌకర్యం లేక రేషన్, పింఛను పొందేందుకు కష్టతరం అవుతుందని కలెక్టర్ దృష్టికి గ్రామస్థులు తీసుకురాగా జిల్లాలో 70 సెల్ టవర్లకు గానూ బీస్ ఎన్ ఎల్ 27, జియో 11 టవర్లు నిర్మాణం కావాల్సి ఉందనీ త్వరలోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అక్కడ నుంచి వెలగ వలస గ్రామాన్ని సందర్శించి పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నవి, లేనిది పరిశీలించారు. జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పా రావు, తాసిల్దారు రమణ, ఎమ్ పి డి ఓ జి.పార్వతీ, ఏ పి ఎమ్ సింహాచలం, ఐసిడిఎస్ పిఓ విజయ లక్ష్మి, గ్రామ సచివాలయం సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కన్నతల్లి, తోడబుట్టిన చెల్లిపై సొంత పత్రికలో విషప్రచారం చేసిన ఘనత వైఎస్ జగన్‌ది

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి విమర్శలు

విశాలాంధ్ర-సాలూరు : గత ప్రభుత్వం హయాంలో ఆడవారికి రక్షణ కరువై వారిపై అనేక అకృత్యాలు జరిగాయని రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కన్నతల్లిని తోడబుట్టిన చెల్లిని అవమానించేలా సొంత పత్రికలో రాతలు రాయించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆడపిల్లల రక్షణ కోసం ఉపన్యాసాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తల్లి, చెల్లిపై సొంత పత్రికలో వ్యక్తిత్వ హననం చేసి విష ప్రచారం చేసిన ఘనత జగన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వైకాపా పరిపాలన అందించిన ఐదు సంవత్సరాలు ప్రజలంతా స్వతంత్రాన్ని కోల్పోయారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చి నాలుగు నెలలు అయిందన్నారు. కూటమి ప్రభుత్వం నిరంతరం ప్రజా శ్రేయస్సుకోసం పరితపిస్తుందన్నారు. అటువంటి ప్రభుత్వంపై సొంత పత్రికలలో తప్పుడు రాతలు రాయించడం, నోటికి వచ్చిన కూతలు కూయడం సరికాదన్నారు.ప్రజాస్వామ్యం గురించి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడటం అంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉంటుందన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ని చదవటం తప్ప స్వతంత్రంగా ప్రెస్‌మీట్ లో మాట్లాడే సత్తా జగన్మోహన్ రెడ్డికి లేదన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నాయకులపై కక్ష్య పూరితంగా కేసులు పెట్టి వేధించారన్నారు. నాడు జరిగిన అన్యాయాలపై నేడు స్వేచ్ఛగా చెప్పుకునే వెసులుబాటు కూటమి ప్రభుత్వంలో ప్రజలకు లభించిందన్నారు. భావవ్యక్తీకరణ స్వాతంత్ర్యం హరిస్తున్నామని అనడం సరికాదన్నారు. భావవ్యక్తీకరణ స్వాతంత్ర్యం అనే పదాన్ని కూడా జగన్మోహన్ రెడ్డి తప్పులు లేకుండా పలకలేకపోతున్నారని ఎద్దేవా చేశారు.మాస్క్ అడిగినందుకు డాక్టర్‌ను పిచ్చోడి చేసి చంపేశారన్నారు.ఉద్యోగులను అనేక వేధింపులకు గత ప్రభుత్వం గురిచేసిందన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి, సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల తెదేపా అధ్యక్షులు ఆముదాల పరమేష్,పిన్నింటి ప్రసాదబాబు, గుళ్ల వేణుగోపాల్, సీనియర్ నాయకులు యుగంధర్, మత్స శ్యాం, హర్షవర్ధన్, అక్కాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ కుంభకోణంపై పూర్తి విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చండి

చింతపల్లి, కొయ్యూరు జెడ్పీటీసీలు బాలయ్య, నూకరాజు

విశాలాంధ్ర-చింతపల్లి : మన్యంలో జరిగిన సోలార్ కుంభకోణానికి పాల్పడిన వారు ఎవరైనా సంబంధిత ఉన్నత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని చింతపల్లి, కొయ్యూరు జడ్పిటిసి సభ్యులు పోతురాజు బాలయ్య, వారా నూకరాజు లు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ చింతపల్లి, జి కే వీధి,కొయ్యూరు మండలాల్లోని మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంటు లోనీ బ్యాటరీలు, సోలార్ ప్లేట్స్ కాజేసిన కుంభకోణం వాస్తవమైతే ఆ కుంభకోణంలో కొంతమంది వైకాపా నాయకుల ప్రమేయం ఉందనడం సరికాదన్నారు. కుంభకోణానికి పాల్పడిన వైకాపా నాయకులు ఎవరో వారి పేర్లు బట్టబయలు చేయవలసిన అవసరం ఆరోపణలు చేసిన వారిపై ఉందన్నారు. చేసిన ఆరోపణలు నిజమైతే అటువంటి వారిపై తమ పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుదన్నారు. ఇటువంటి కుంభకోణాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా తమ పార్టీ ఉపేక్షించబోదన్నారు.ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి విద్యుత్ సదుపాయం లేని మారుమూల గిరిజన గ్రామాలకు సోలార్ సిస్టమ్ ద్వారా విద్యుత్ సరఫరా చేయాలని, తద్వారా మారుమూల గ్రామాలకు వెలుగులు ప్రసాదించాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ల లోని బ్యాటరీలు, ప్లేట్లు కొంత మంది అక్రమార్కులు కాజేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. అక్రమార్కులు ఏ పార్టీ నాయకులైన, ఎంతటివారైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కుంభకోణంపై సమగ్రమైన విచారణ జరిపి బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నత అధికారులను కోరుతున్నామన్నారు. మన్యంలో ఇలాంటి సంఘటనలు పురాణవృతం కాకుండా అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై అల్లూరి జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులను కలిసి ఫిర్యాదు చేయడంతో పాటు, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-చింతూరు : చింతూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతు శాస్త్ర విభాగం, జాతీయ సేవా పథకం(యన్ యస్ యస్) ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రత్నమాణిక్యం తెలియజేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో క్యాన్సర్ వ్యాధి గురించి సరైన అవగాహన లేకపోవడంవల్ల భారతదేశంలోని స్త్రీ,పురుషులలో ఊపిరితిత్తుల క్యాన్సర్, వక్షోజ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ ఎక్కువగా వ్యాపిస్తుందని, తగిన అవగాహన పెంపొందించుకోవడం వల్ల క్యాన్సర్‌వ్యాధి వ్యాప్తిని తగ్గించుకోగలమని, ముఖ్యంగా డ్రగ్స్, మత్తుపదార్థాలు, మద్యపానానికి దూరంగా ఉండటం వల్ల క్యాన్సర్ వ్యాధినిని నివారించవచ్చు నన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముల్లిశేఖర్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి గురించి విద్యార్థుల్లో అవగాహన ఎక్కువగా ఉండాలని తద్వారా తమను,తమ కుటుంబాలను క్యాన్సర్ భారి నుండి రక్షించుకోవచునన్నారు. ఎన్.ఎస్. ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ మరియు జంతు శాస్త్ర విభాగాధిపతి జి.సాయికుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిలో రెండు రకాల వ్యాధులు ఉంటాయని, అవి కణితి రూపంలో, రక్తంలో మలినమై శరీరమంతా వ్యాపించి దద్దుర్ల రావడం, తల వెంట్రుకలు ఊడిపోవడం వంటి లక్షణాలు ఉంటాయని, ఈవ్యాధి సోకిన వారికి నాలుగవ దశలో ప్రాణహాని కలుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో జి.వెంకట్రావు, ఆర్.సి.హెచ్. నాగేశ్వరరావు, డా.వై.పద్మ, ఎస్.అప్పనమ్మ, జి.హారతి,కె. శైలజ, కె. శ్రీలక్ష్మి, కె.శ్రీదేవి, ఆర్. మౌనిక, పి. అలివేలు, ఎన్. రమేష్, బి.శ్రీనివాసరావు, సుభద్ర,ఎస్. మూర్తి, వి.శీనయ్య తదితర అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రావాడ రామభద్రపురం ఆశ్రమ పాఠశాలను సందర్శన మంత్రి సంధ్యారాణి

- గిరిజన విద్యార్థి మృతిపై సిబ్బందిని, ఉపాధ్యాయులను, విద్యార్థులను, తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించిన మంత్రి
- పూర్తిస్థాయిలో న్యాయం చేస్తాం: గిరిజన సంక్షేమ శాఖమంత్రి సంధ్యారాణి



విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలో రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి శుక్రవారం సందర్శించారు. ఈనెల6న పాఠశాలలో ఏడవ తరగతి విద్యార్థి నిమ్మక జీవన్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందడంతో దీనికి గల కారణాలను తెలుసుకోవడానికి ఆమె విచ్చేసి అందరిని విచారించారు. కురుపాం, పార్వతీపురం,పాలకొండ శాసనసభ్యులు తోయక జగదీశ్వరి, బోనెల విజయచంద్ర ,నిమ్మక జయకృష్ణలతో కలిసి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి దర్యాప్తు ప్రారంభించారు. ముందుగా సహచర విద్యార్థులు పి పవన్ కుమార్, అరిక సంతోష్, కొండగొర్రె ప్రేమ్ కుమార్, పువ్వల సిద్ధూలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరువాత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం తిరుపతి, డిప్యూటీ వార్డెన్ ఎల్ గణపతిరావులను ఏం జరిగిందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతుని తండ్రి ఎం.కృష్ణారావుతో మాట్లాడి విషయం తెలుసుకున్న ఆమె కచ్చితంగా న్యాయం చేస్తామని ఆమెభరోసా ఇచ్చారు. ఇదిలాఉండగా మృతుని నిమ్మకాయ జీవన్‌కుమార్ తండ్రి కృష్ణారావుతో మాట్లాడుతున్న సమయంలో కలుగజేసుకొని మాట్లాడబోతున్న ప్రజా సంఘాల నాయకులు గంగునాయుడు, సీతారాం, రంజిత్ కుమార్ లు దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని చేయాలనగా మంత్రి సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తంచేశారు. మృతునితండ్రి కృష్ణారావు ఎంక్వైరీ చేయించాలని కోరితే ఖచ్చితంగా రీ ఎంక్వయిరీ చేస్తానని, మరెవరు చెప్పిన వేయడం జరగదని తెగేసి చెప్పారు. తర్వాత రీ ఎంక్వయిరీ చేయించాలా అని మృతుని తండ్రి కృష్ణారావును మంత్రి అడగగా, అందుకు అతను వద్దని తన భార్య నాలుగు నెలల క్రితమే మృతి చెందిందని,ఇప్పుడు నాఒక్కగానొక్క కుమారుడు జీవన్ కుమార్ మృతిచెందడంతో తేరుకోలేకపోతున్నానని తెలిపారు. తన ఇద్దరు ఆడబిడ్డలను పోషించి, చదివించుకునే అవకాశం కల్పించాలని మృతుడు తండ్రికృష్ణారావు మంత్రి సంధ్యారాణిని వేడుకున్నాడు. నీకు జరిగిన అన్యాయం తీర్చలేమని, అతనిని మంత్రి ఓదారుస్తూ నీకు కచ్చితంగా న్యాయంచేసి తీరుతామని, ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. కలెక్టర్, ఐటిడిఏ పిఓలతో మాట్లాడి త్వరలోనే న్యాయం చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొంగు సురేష్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నియోజకవర్గం టిడిపి అధికార రామకృష్ణ,కురుపాం నియోజకవర్గ జనసేన ఇన్చార్జి కడ్రక మల్లేశ్వరరావు, సత్యనారాయణ గురాణ శ్రీరామమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ హౌస్ అరెస్టులపట్ల ఖండన

విశాలాంధ్ర-పార్వతీపురం : వాలంటీర్ల విద్యా సదస్సు విజయవాడలో శనివారం నాడు గుజ్జుల ఈశ్వరయ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న దృష్ట్యా ఈసమావేశానికి హాజరుకాకున్న ముందస్తుగా పార్వతీపురం మన్యం జిల్లాలోని ఏఐటియుసి నాయకులను అక్రమ హౌస్ అరెస్టులు చేసి నిర్బంధించడం సబబు కాదని జిల్లా కార్యదర్శి కోరంగి మన్మధరావు విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హౌస్ అరెస్ట్ చేసి నిర్బంధించడం మంచి పద్ధతి కాదన్నారు. ఆయనతోపాటు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్ వి ఎస్ కుమార్ పాల్గొన్నారు.

అసరాడ గ్రామంలో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం

విశాలాంధ్ర-జీకే వీధి : అసరాడ గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామస్తులు స్వచ్ఛందంగా పాల్గొని రోడ్డుకి ఇరువైపులా పరిసరాల పరిశుభ్రంగా గంటపాటు శ్రమదానం చేశారు. రీంతాడ పంచాయతీ పరిధిలో ఉన్న చెత్త సంపద కేంద్రం సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ షెడ్లు నిరు ప్రయోగంగా ఉందని వాటిని పూర్తిస్థాయి వినియోగంలోకి తీసుకోరావాలని జనరల్ బాడీ సమావేశంలో వార్డు సభ్యులు కోరడంతో శుక్రవారం ఘన ద్రవ వ్యర్థాలు నిర్వహణ కొరకు చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు సర్పంచ్ లక్ష్మి కార్యదర్శి అరుణకుమార్ వెంటనే పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనికి వెళ్లకుంటే జాబ్ కార్డు రద్దు

ఎంజి ఎన్ఆర్జీఎస్ ఏపీఓ మణికుమారి

విశాలాంధ్ర-మారేడుమిల్లి : ప్రతి ఒక్కరూ జాబ్ కార్డు ని ఉపయోగించి పనులను సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం నాడు ఏపీవో మణికుమారి పూజారికి గ్రామంలో రైతులకు ఉపాధి హామీపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీవో మణికుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జాబ్‌కార్డును సద్వినియోగం చేసుకోవాలని చేసుకుని ఎడల జాబ్‌కార్డు రద్దు చేయడం జరుగు తుందన్నారు. గ్రామంలోని తుప్పలను, నీటిని నిలువ కుండ చూసుకోవాలని గ్రామస్తులకు తెలియ జేయడం జరిగింది గ్రామంలో పరిశుభ్రతను పాటించాలని అన్నారు, రబ్బర్ మొక్కలకు పెన్షన్ ఉపాధి హామీ పథకంలో చేసుకోవాలని అన్నారు సుమారు 300 రూపాయలు కూలి వస్తుందని, వారం వారం పేమెంట్ చేయడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరు జాబ్ కార్డుని తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని అన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి ఒక్క పథకాలను సద్వినిగం చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా ప్రధానమంత్రి రాజ్ గర్ దివాస్, జల ఉత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు నీటిని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ చిన్నమ్మి, ఫీల్డ్ అసిస్టెంట్ బేబీ రాణి, బిఎఫ్టీ మొనర్జీ గ్రామస్తులు పాల్గొన్నారు.

వీడీవీకే ఉత్పత్తుల హబ్‌లు ఏర్పాటు చేయండి

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : వన్ దన్ వికాస్ కేంద్రాలు భవనాలకు మరమ్మత్తులు చేపట్టి 12 వీడి వీకే హబ్ లు ఏర్పాటు చేయాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. శుక్రవారం ప్రాజెక్టు అధికారి క్యాంప్ కార్యాలయంలో ఐటీడీఏ అధికారులు, వెలుగు అధికారులతో వీడివీకే ఉత్పత్తులు పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చింతపండు, పసుపు, కొండ చీపుర్లు, కాఫీ, అడ్డాకులు తయారీ లను వీడివికే కేంద్రాల ద్వారా విక్రయాలు చేపట్టాలని ఆదేశించారు. పాడేరు డివిజన్లో ఏర్పాటు చేసిన వీడివికే లలో గిరిజన ఉత్పత్తులను ప్రారంభించాలని పేర్కొన్నారు. ముందుగా పది విడివికే భవనాలను మరమత్తులు చేసి విడివికే హబ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మంజూరు చేసిన 106 వన్ దన్ వికాస్ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. అడ్డాకుల తయారీ హబ్ లు5 , చీపుర్ల హబ్ లు 2 , చింతపండు హబ్ లు 2, కాఫీ పౌడర్ తయారీ హబ్ లు 3 ఏర్పాటు చేయాలని చెప్పారు. వందన్ వికాస్ కేంద్రాలను అభివృద్ధి చేసి గిరిజన మహిళలకు ఆర్థిక చేయూత అందించాలన్నారు.

కుళాయిలను సద్వినియోగం చేసుకొని నీటిని పొదుపుగా వాడండి

- వాముగెడ్డ కొత్తూరులో నీటి కొళాయిల ప్రారంభం
- నాయకులను అభినందిస్తూ శాలువతో సత్కరించిన గ్రామస్తులు

విశాలాంధ్ర-చింతపల్లి : మండలంలోని చౌడుపల్లి పంచాయితీ వాముగెడ్డకొత్తూరు గ్రామంలో 7,50,000 అంచనా వ్యయంతో జలజీవన్ మెషిన్ ద్వారా నిర్మించిన నీటి కొళాయిలను శుక్రవారం వైకాపా సీనియర్ నాయకుడు సింహాచలం, పంచాయితీ వార్డు సభ్యుడు కరుణానిధి లతో కలిసి జనసేన మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు, ఎన్డీఏ కూటమి నాయకులు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి కుళాయిలను పొదుపుగా వాడుకోవాలని, అవసరమైన మోతాదులోనే నీటిని వినియోగించాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో నీటి సమస్యలతో ఎన్నో ఏళ్లుగా బాధపడ్డామని, గ్రామంలో నీటి కష్టాలను గుర్తించి అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో కుళాయిలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. అనంతరం గ్రామస్తులు నాయకులను అభినందిస్తూ శాలువాలతో సత్కరించారు. కూటమి నాయకులు, గ్రామస్తులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ధాన ధర్మ ద్వారా సామూహిక సీమంతాలు, వృద్దులకు దుప్పట్లు

విశాలాంధ-వై రామవరం : మండలం లోని పెద్ద ఉలెంపాడు గ్రామంలో దాన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ సహాయంతో బొగ్గులు కాటంరెడ్డి పర్యవేక్షణలో హిందూ నేషన్ ఫౌండేషన్ తోట రామకృష్ణ సామూహిక సీమంతాలు చలికాలంలో వృద్దులకు ఇబ్బందులు రాకుండా దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం అనంతరం బొగ్గులు కాటంరెడ్డి మాట్లాడుతూ గిరిజన సాంప్రదాయాలు పాటించాలని, పాటించిన వారు మాత్రమే గిరిజనులు అవుతారని ఇది చట్టంలో పొందుపరచి ఉందని కనుక గిరిజనులందరూ వారి రిజర్వేషన్ల దృష్ట్యా గిరిజన సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని ఇతర దేశ ఆచారాలను ప్రోత్సహించి గిరిజన ఐక్యతను దెబ్బతీసుకోవద్దని గిరిజనులందరూ వారి హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం తోటరామకృష్ణ మాట్లాడుతూ గిరిజనులకు వచ్చే ధార్మికపరమైన సమస్యలకు గిరిజన ఆచార వ్యవహారాలు భంగం కలిగించే వ్యక్తులపై పోరాటం చేస్తున్న గిరిజనులకు చట్టపరమైన సహాయం చేయుటకు కాటన్ రెడ్డి తో కలిసి హిందూ నేషన్ ఫౌండేషన్ పనిచేస్తుందని దానికోసం ధార్మిక పెద్దలు గిరిజనులు కలిసికట్టుగా రావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బొగ్గుల సత్యనారాయణరెడ్డి, చొడి రాంబాబు, రాజ్ కుమార్ రెడ్డి, తోట సూర్య కుమారి మరియు ధార్మిక కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక లోపం వికలాంగుడి శాపం

10 నెలలుగా సదరం కోసం ఎదురుచూపు

విశాలాంధ్ర-కూనవరం : దురదృష్టవశాత్తు కాలు పోగొట్టుకున్న కొమరయ్యకి 85% అంగవైకల్యం ఉన్నట్టుగా వైద్యులు ధృవీకరించినప్పటికీ సదరం సర్టిఫికెట్ మంజూరు చేయడంలో సాంకేతిక లోపం ఉన్నట్లుగా గుర్తించారు. దానిని సరిచేసి తనకు పెన్షన్ మంజూరు చేయాలని కొమరయ్య కుటుంబం కోరుతుంది. తనకు ఇచ్చిన సదరం ఐడి ప్రకారం వెబ్‌సైట్‌లో అంగవైకల్యం లేనట్టుగా చూపిస్తుందని, ఆ సాంకేతిక లోపాన్ని సరి చేయాలని కోరుతున్నాడు. అధికారులు తన పరిస్థితిని గమనించి తనకి పెన్షన్‌తో పాటు మూడు చక్రాల బండిని ఇప్పించవలసిందిగా అభ్యర్థిస్తున్నాడు. పుట్టుకతో వచ్చిన అంగవైకల్యం అయితే అలాంటి వాళ్ళకి ఎంతో కొంత నడక అలవాటు ఉంటుంది కానీ హఠాత్తుగా ఒక కాలు తీసేస్తే ఏ ఆఫీసులకు వెళ్లాలన్నా ఒంటి కాలుపై నడవడం నరకప్రాయంగా మారిందని కొమరయ్య ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. వీలైనంత త్వరగా తన సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను వేడుకుంటున్నాడు.

బాల్యవివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి : ఎంపీడీవో రామకృష్ణ

విశాలాంధ్ర-గంగవరం : బాల్య వివాహాలు జరగకుండా బాల్య వివాహ నిరోధక కమిటీ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పిజి రామకృష్ణ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బాల్య వివాహ నిరోధక కమిటీ సభ్యులతో మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా తల్లిదండ్రులు బాల్యవివాహాలు జరిపేందుకు ప్రయత్నిస్తే వారిని అవగాహనపరిచి బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా సిడిపిఓ లక్ష్మీ మాట్లాడుతూ జనవరి నెల నుండి ఇప్పటివరకు సుమారు 6 బాల్య వివాహాలను ఆపించడం జరిగిందన్నారు. ఈసమావేశంలో లక్ష్మి, డిప్యూటీ తాసిల్దార్ రాంబాబు, సిహెచ్ఓ మేరీ, ఐసిడిఎస్ సూపరవైజర్స్ సత్యవతి జయలక్ష్మి, వెలుగు సిసి మోహన లక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

తెరుచుకోని బందెల దొడ్డి రోడ్లపై పశువులు

విశాలాంధ్ర-కూనవరం : వ్యవసాయ పనులు ప్రారంభమై రైతులు పంటలను కాపు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అయితే పశువుల కాపు అనేది ఈ సీజన్లో అత్యంత ముఖ్యమైన భూమికి పోషిస్తుంది. కూనవరం గ్రామపంచాయతీ పరిధిలోని టేకులబోరు గ్రామంలోని బందెలదొడ్డిని పంచాయతీ వారు నిర్వహించేవారు. కానీ గత రెండేళ్లుగా దీనిపై దృష్టి పెట్టకపోవడంతో అది శిధిలావస్థకు చేరింది. ఇంకా కాపు పట్టని పశువులు ఇటు రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతూ వాహనదారులకు అడ్డం వచ్చి ప్రమాదాలు జరగడానికి కారణం అవుతుండగా, మరోపక్క పంటపొలాలను పాడు చేస్తున్నాయని రైతులు అంటున్నారు. పక్క గ్రామాల్లో ఇప్పటికే బందెల దొడ్డి వేలంపాటలు నిర్వహించి పంచాయతీలు ఆదాయాన్ని ఆర్జిస్తుంటే కూనవరంలో మాత్రం నిధుల కొరత లేకపోవడంతో దాని ఊసే మరచిపోయారు. పూర్వం అడవి నుంచి కర్రలు తెచ్చి పంట చుట్టూ కంచెకట్టుకునే వాళ్ళమని ఇప్పుడు ఆ పరిస్థితి లేనందున పశువులు కాపు చేయకపోతే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పిల్లలు ఎదుగుదలపై అంగన్వాడీలకు శిక్ష తరగతులు

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి కె విజయకూమారి

విశాలాంధ్ర-కొయ్యూరు : అంగన్వాడి కేంద్రాల్లో విద్యను అభ్యసించే చిన్నారులకు గ్రోత్ మానిటరింగ్ పై అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం జరిగింది కే విజయ కుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీల్లో చదివే చిన్నారుల బరువు తక్కువ పిల్లలను గుర్తించి వారి పోషణ స్థాయి మెరుగుపరిచేందుకు అంగన్వాడి కార్యకర్తలు మెళుకువలు పాటించాలని ఆమె అన్నారు వీరందరికీ రెండోసారి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు అనంతరం అంగన్వాడి కేంద్రాలకు గ్రోత్ పరికరాలను పంపిణీ చేసి నేమ్ బోర్డులు టోల్ ఫ్రీ నెంబర్ బోర్డులు ఆవిష్కరించడం జరిగిందని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భగవాన్ బిర్సాముండా జయంతి సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్ ఏర్పాటు

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా రాజవొమ్మంగి మండల భగవాన్ బిర్సా సమితి అధ్యక్షుడు తాము సూరిబాబు అధ్యక్షతన వాలిబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గడుఓకుర్తి పంచాయితీ దోనెల పాలెం గ్రామంలో రిబ్బన్ కత్తిరించి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. వాలీబాల్ పోటీలు ఈ నెల 8,9,10వ తేదీలలో జరుగుతాయని,12వ తేదీన విజేతలకు స్థానిక రాజకీయ నాయకుల చేతులమీదుగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. మండలంలో ఏ గ్రామస్తులైన ఈ టోర్నీలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్ చంద్రుడు, ఉప సర్పంచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ మాధవరెడ్డి ఏజెన్సీ పర్యటన

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం: పార్వతిపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్ పేట పోలీస్ స్టేషన్ ని శుక్రవరం ఎస్పీ ఎస్ వి మాధవరెడ్డి తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిశీలించి పోలీస్ స్టేషన్ పరిస్థితి, రికార్డులు పరిశీలించారు. ప్రజలు సైబర్ నేరగాల చిక్కుల్లో చిక్కకుండా, భద్రతా చర్యలపై అవగాహన సదస్సులు నిర్వహించమని తెలిపారు. ఎల్విన్ పేట చెక్ పోస్ట్ ను పరిశీలించి చెక్ పోస్ట్ వద్ద మరింత నిఘ పెట్టమని సిబ్బందిని ఆదేశించారు. చెక్ పోస్ట్ వద్ద మాదకద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పూర్తి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాత్రి సమయాల్లో మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి మత్తుపదార్థాలు రవాణా జరగకుండా మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయనని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు భద్రత చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే వివరాలను అడిగి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన తెలిపారు.

ఖాళీగా ప్రభుత్వ భవనాలు

నిర్వహణ లోపం... తరలిపోయిన మండల పరిషత్ కార్యాలయం

విశాలాంధ్ర-కూనవరం : లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించి గాలికి వదిలేసిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉంటే అధికారులు తమకు పట్టనట్టు వ్యవహరించడం సరైనది కాదు. ప్రభుత్వ శాఖలు ప్రజలకోసమే పనిచేయాలి. వాళ్ళ సౌకర్యార్థం అందుబాటులో ఉండాలి. కానీ కూనవరంలో అధికారుల ఆలోచన వేరేలా ఉంటుంది.వాళ్లు ప్రజలకు, మీడియాకి దూరంగా ఉండేందుకు కంఫర్ట్ జోన్ చూసుకుంటారు అనడంలో మండల పరిషత్ కార్యాలయాన్ని కోతులగుట్టకు తరలించిన ఉదంతమే నిదర్శనం. పాత ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన సంగతి తెలిసిందే. ఆ కార్యాలయాన్ని ఆ భవనం నుంచి వేరే చోటికి తరలించాలి అనే విషయంలో అధికారుల బాధ్యత రాహిత్యం స్పష్టంగా కనిపిస్తుంది.పాత ఎంపీడీవో ఆఫీస్ పక్కనే ఏటిడబ్ల్యు వారి విద్యా భవనాలు, హాస్టల్ భవనాలు సుమారు 6 బిల్డింగులు ఖాళీగా ఉంటున్నాయి. దాంట్లో పిల్లలు లేక కొంతకాలంగా మూతపడ్డాయి. పిచ్చి చెట్లు పొదలు మొలిచి నిరుపయోగంగా ఊరి నడిబొడ్డునే అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. వాటిని బాగుచేసుకుంటే ఒక్క మండల పరిషత్ కార్యాలయం ఏం ఖర్మ ,ఇంకా ఏ ఏ శాఖలకు సొంత భవనాలు లేవో వాటన్నిటిని ఈ భవనాల్లో నిర్వహించవచ్చు.కానీ ఆ మాత్రం బాధ్యత తీసుకునే అధికారి లేకపోవడం వలన మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో కోతులగుట్టలో మండల పరిషత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారు. అన్ని కార్యాలయాలు బ్యాంకులు ఒకే దగ్గర ఉంటే గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ఇక పాత ఎంపీడీవో కార్యాలయంలో మిగిలి ఉన్న ఒకే ఒక శాఖ ఎన్ఆర్ఈజీఎస్ శాఖ. బిక్కుబిక్కుమంటూ అదే భవనంలో విధులు నిర్వహిస్తున్న ఆ శాఖని అయినా కనీసం పక్క భవనాల్లోకి షిఫ్ట్ చేస్తే ప్రజలకు కొంత వెసులుబాటు ఉంటుంది. అంతేకాకుండా కోతులుగుట్ట తరలించిన మండల పరిషత్ కార్యాలయాన్ని కూడా తిరిగి టేకులబోర్‌లోని ఈ విద్యా భవనాల్లో ఏర్పాటుచేయాలని ప్రజలనుంచి బలంగా డిమాండ్ వినిపిస్తోంది.

సచివాలయ హెల్త్ సెక్రటరీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

జిల్లా నూతన కమిటీ ఎన్నికలో అధ్యక్షురాలు ఎం వి ఎస్ కుమారి, కార్యదర్శి తులా బోతి

విశాలాంధ్ర-పాడేరు రూరల్ : సచివాలయ హెల్త్ సెక్రటరీల సమస్యలు తక్షణమేపరిష్కరించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన కమిటీ అధ్యక్షురాలు ఎం వి ఎస్ కుమారి, కార్యదర్శి తులా బోతి అన్నారు. శుక్రవారం పాడేరులో సచివాలయం హెల్త్ సెక్రటరీల సమావేశం సీఐటీయూ నాయకులు ఎల్ సుందర్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక జరిగింది.అధ్యక్షురాలు ఎం వి ఎస్ కుమారి, కార్యదర్శి తులా బోతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగాసిఐటియు జిల్లా నాయకులుఎల్ సుందర్రావు మాట్లాడుతూ సచివాలయ హెల్త్ సెక్రటరీ యొక్క సమస్యలను ఎన్నిసార్లు అధికారులకు చెప్పి వినతి పత్రాలు ఇచ్చిన సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ సెక్రటరీలు సచివాలయంలోనే ఫేషియల్ అటెండెన్స్ వెయ్యాలని నిబంధన వలన తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,వైద్య ఆరోగ్యశాఖ విధులతో పాటు వేరే శాఖకు సంబంధించిన అదనపు విధులను కూడా చేయాలని సచివాలయం సిబ్బంది చెబుతున్నారని దీనివలన తీవ్రమైన ఇబ్బంది పడుతున్నారన్నారు. వైజాగ్ శాఖలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగులకు యూనిఫామ్ అలవెన్స్ ఇస్తుండగా ఇక్కడ హెల్త్ సెక్రటరీలకు మాత్రం ఇవ్వకపోవడం దారుణమని హెల్త్ సెక్రటరీలకు ప్రమోషన్ కల్పించాలని సీనియర్టి జాబితాలో జరుగుతున్న అవకతవతాల విషయమై అధికారులకు తక్షణమే స్పందించాలని ఈ సమస్యలపై దృష్టి సారించకపోతే హెల్త్ సెక్రటరీలు అందరు కూడా నిరసన కార్యక్రమాలు చేయవలసి ఉంటుందని దానికి అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎల్ సుందర్రావు పాల్గొని నూతన కార్యవర్గంగా హెల్ సెక్రెటరీల సంఘం గౌరవ అధ్యక్షులుగా శెట్టి నాగరాజు సిఐటియు, అధ్యక్షురాలుగా,ఎం వి వి ఎస్ కుమారి, ప్రధాన కార్యదర్శిగా తులబోతి, కోశాధికారిగా,అంబికా, ఉపాధ్యక్షురాలుగా, కృష్ణవేణి సహాయ కార్యదర్శిగా,అనిత రాణి, 11 మండలాల అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగిందన్నారు.

గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి : డాక్టర్ టి.జగన్మోహన్‌రావు

విశాలాంధ్ర-కూనవరం : గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉన్న హెల్త్&వెల్నెస్ కేంద్రాల్లో వైద్య సేవలు మెరుగుపడే దిశగా కృషి చేయాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టీ. జగన్మోహనరావు సూచించారు. కల్లికోట, గుణానుపురం హెల్త్&వెల్నెస్ కేంద్రాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. ప్రతీరోజూ ఆరోగ్య కేంద్రంలో ఎంత మంది వైద్య సేవలు వినియోగించుకుంటున్నారు. నమోదు చేసిన అనారోగ్య సమస్యలు, ఏ విధమైన చికిత్స అందజేస్తున్నారని రికార్డుల్లో పరిశీలించారు. తనిఖీలకు వచ్చిన ప్రతీ ఒక్కరి ఆరోగ్య సమస్య వైద్య సిబ్బంది స్పష్టంగా తెలుసుకోవాలని,తద్వారా సరైన చికిత్స అందించాలన్నారు పలు రికార్డులో దీర్ఘకాలిక రోగుల వివరాలు పరిశీలించారు. వీరిలో ఆరోగ్యం మెరుగు చెందని వారిని గుర్తించి అందుకు గల కారణాలపై విశ్లేషణ చేయాలన్నారు. మందులు పరిశీలించి కాలపరిమితి చేరువలో ఉన్నవాటిని సద్వినియోగం చేయాలన్నారు. కేంద్రంలో రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రీ-పిఎంఎస్ఎంఎ ద్వారా గర్భిణీలకు తనిఖీలు చేపట్టి హైరిస్క్ సమస్యలను గుర్తించాలన్నారు. హైస్కూల్ సందర్శించి ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందితో సమీక్షించారు. హిమోగ్లోబిన్ పరీక్షల రికార్డులు తనిఖీ చేసారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల లభ్యతను పరిశీలించారు. రక్తహీనతగా గుర్తించిన విద్యార్థిని పరిశీలించగా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యకు చికిత్స తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆరోగ్యం మెరుగుకై తగు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి రక్తహీనత,పరిశుభ్రత, సీజనల్ వ్యాదులు, పలు ఆరోగ్య సూత్రాలు వివరించి అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ ఎ. గదబవలస గ్రామంలో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వ్యక్తి ఆరోగ్య స్థితిని పరిశీలించారు. కేస్ షీట్‌ను తనిఖీ చేసి చికిత్సా వివరాలు పరిశీలించి, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ నాగభూషణ రావు, సూపర్వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది వర్షిణి, నాగేంద్ర, శ్రావణి,లక్ష్మి,ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ పార్వతీపురంకు సహకరించండి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణాన్ని స్వచ్ఛ సుందర పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు వ్యాపారసంస్థలు, దాతలు ముందుకురావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ వ్యాపార సంస్థలు, సంఘాలతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇది మంచి జిల్లా, మంచి ఊరుగా పేరు ఉందని, దాన్ని నిలుపుకోవలసిన అవసరం అందరిపై ఉందన్నారు. అందులో భాగంగా పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు అందరూ ముందుకురావాలని కోరారు. ఒక్కో సంస్థ ఒక్కో ప్రాంతాన్ని దత్తత తీసుకొని,దాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. పట్టణంలో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారుల మరమ్మతులు వంటివి ప్రభుత్వం తరపున చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే పార్కుల అభివృద్ధి, ముఖ్య కూడళ్ళ అభివృద్ధిని వివిధ సంస్థలు చేపట్టాలని కోరారు. వాటర్ ఫౌంటైన్ తో కూడిన సెల్ఫీ పాయింట్లు, హెూటళ్లు, స్మశానవాటికలు ఏర్పాటుకు ఆలోచన చేయాలని సూచించారు. కొత్తగా వూరికి వచ్చే వారికి మంచి అభిప్రాయం కలిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పట్టణాభివృద్ధికి సంబందించి చర్చించిన అంశాలపై దృష్టి సారించాలని తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో పురపాలక సంఘ కమిషనర్ జి.శ్రీనివాసరాజు శానిటరీ ఇన్స్పెక్టర్ కేవీపీ రాజు,గోల్డ్ మార్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాలరావు, డా. డి. పారినాయుడు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మనస్థాపంతో తండ్రి ఆత్మహత్య

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని అంటిపేట పంచాయతీలో వెంకటాపురం గ్రామానికి చెందిన కొట్యాడ నరసింహులు (54) పురుగుల మందు తాగి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు .వివరాలు పరిశీలిస్తే అతను దీపావళినాడు అంటిపేట గ్రామంలోని వైన్ షాప్ కు మద్యంకోసం వెళ్లగా పక్కనేఉన్న చిరుదుఖానం నిర్వహిస్తున్న యజమానికి బాకీ ఉండడంతో అతనితో ఘర్షణ జరిగింది. అదే సమయంలో అతను కుమారుడు కూడా అక్కడ ఉన్నాడు. కొద్దిసేపు ఘర్షణ జరిగినట్లు తెలిసింది. మరలా నాగులచవితినాడు కూడా నరసింహులు మద్యంకోసం అంటిపేట వైన్ షాపు వద్దకు తన కుమారుడు హరిక్రిష్ణతో కలిసి వెళ్లగా పక్కనే ఉన్న చిరుదుకాణం యజమానితో డబ్బులుగూర్చి మరలా ఘర్షణ జరిగింది. ఈసమయంలో తోపులాట కూడా జరిగింది. ఈతోపు లాటలో అంటిపేట గ్రామంలో చిరుదుకాణం నిర్వహిస్తున్నవ్యక్తి రోడ్డుపై పడి తలకుతీవ్రగాయమైనది. దీంతో ఆయనను బొబ్బిలి ఆసుపత్రికి తరలించారు. అక్కడనుండి పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం తరలించారు. ఈసమాచారం తెలిసి నరసింహులు,అతని కుటుంబసభ్యులు కొంత ఆందోళనకు గురయ్యారు. అంటిపేట చిరుదుకాణం యజమాని పరిస్థితి తీవ్రంగా ఉండడంతో ఆయనచనిపోతే తనకొడుకు హరికృష్ణపై కేసు పెద్దది అవుతుందని ఆలోచన,తర్వాత వారిచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఆరోజు గొడవ జరిగినప్పుడు ఉన్నటువంటి తన కుమారుడు కొట్యాడ హరికృష్ణను సీతారాం పోలీసులు గురువారం పోలీస్ స్టేషన్‌కు తీసుకునివచ్చి వివరాలను అడిగారన్న విషయాన్ని తెలుసుకున్న తండ్రి కొట్యాడ నరసింహులు మనస్తాపం చెంది గురువారం మధ్యాహ్నాం ఇంట్లోఉన్న పురుగుల మందును పెద్దమోతాదులో తాగాడు. సాయంత్రం కుటుంబసభ్యులు చూసి బొబ్బిలి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడనుండి విజయనగరం తరలించారు. విజయనగరంలో చికిత్సపొందుతూ గురువారం రాత్రి మరణించాడు. మృతునికి భార్య,ఇద్దరు కుమారులున్నారు. అంటిపేటలో షాపు వద్ద జరిగిన గొడవలతో మనస్థాపన చెందడంతోపాటు పోలీస్ స్టేషన్ కు కుమారుడిని పిలిచారన్న కారణంతో మనస్థాపంచెంది ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. అతని పెద్దకుమారుడు శివకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం రాజేష్ తెలిపారు. మృతదేహానికి విజయనగరంలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అందజేయగా,శుక్రవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

నాదెండ్ల మనోహర్‌ని కలిసిన మండల జనసేన నాయకులు పెంట తిరుపతిరావు

విశాలాంధ్ర-మక్కువ : రాష్ట్ర పౌర సరఫరాలు, ఆహారం వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ని కలిసిన మక్కువ మండలం జనసేన నాయకులు పెంట తిరుపతి రావు, పార్వతీపురం నియోజకవర్గం ఇంచార్జ్ ఆదాడ మోహన్‌రావు ఈ సందర్భంగా పార్టీ బలోపేతం కోసం ఏవిధంగా కృషి చేయాలి అని చర్చింస్తు,మక్కువ మండలం లో గల గిరిజన హామ్లెట్ విలేజెస్ ప్రజలు హెడ్ క్వార్టర్ కి వెళ్లి రేషన్ తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. హామ్లెట్ గ్రామాలకు రేషన్ డిపోలు ఏర్పాటు చెయ్యాలని కోరటం జరిగింది.

మూడు వసతిగృహాల్లో పల్లెనిద్ర - మరో మూడు గ్రామాలో గ్రామదర్శిని నిర్వహణ

విశాలాంధ్ర-సీతానగరం : కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో మొదటిసారిగా గురువారం నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమాన్ని మండలంలోని జోగంపేట ప్రతిభ కళాశాలలోనూ, డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులకళాశాలలో, మరిపివలస ఎస్సీ బాలికల వసతిగృహాల్లో నిర్వహించారు. ప్రతిభా కళాశాలను ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ, బిఆర్ అంబేద్కర్ కళాశాల గురుకులాన్ని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె ప్రసాద్, మరిపివలస ఎస్సీ బాలికల వసతి గృహాన్ని మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ వై.విమలలు సందర్శించి రాత్రి బసచేశారు. అక్కడ వసతి గృహాల్లో, గురుకులాల్లో

సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనాలు చేసి రాత్రిపూట కలిసి పడుకున్నారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ రూపొందించిన గ్రామదర్శిని కార్యక్రమంలో గుచ్చిమి గ్రామ సచివాలయంలో ఐటీడీఏ పిఓ & సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జోగంపేట సచివాలయాన్ని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రసాద్, సూరంపేట సచివాలయాన్ని మార్క్ ఫెడ్ డిఎం విమల సందర్శించి సచివాలయం పరిధిలోని అంగన్వాడి, పాఠశాల, చెత్త సంపద కేంద్రాన్ని, గ్రామాలో పరిశుభ్రత, విద్యా వైద్య తదితర కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమరావు తహసిల్దార్ ఉమామహేశ్వరరావు ఎంఈఓ సూరిదేముడు, వెంకటరమణ, ఏఓ అవినాష్, వైద్యులు ఉషారాణి, పావని, పశువైద్య అధికారి రామారావు, వెలుగు ఏపిఎం శ్రీరాములు నాయుడు, కళాశాల ప్రిన్సిపాళ్ళు, వార్డెన్లు, ఆయా సచివాలయంలసిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్ హైకోర్టు జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన సబ్ కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లా పర్యటనలో భాగంగా పార్వతీపురంకు విచ్చేసిన గుజరాత్ రాష్ట్ర హైకోర్ట్ జడ్జి సిహెచ్.మానవేంద్రనాథ్ రాయ్ ని మర్యాద పూర్వకంగా సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ కలిసి పూల మొక్కను అందజేశారు. మన్యం జిల్లా కేంద్రానికి చెందిన జడ్జి సిహెచ్. మానవేంద్రనాథ్ రాయ్‌తో కొద్దిసేపు ఆయన మాట్లాడారు.